సాక్షి
పెద్దపల్లి
మంగళవారం । 11 । ఏప్రిల్ । 2023



నిర్మించారు.. వదిలేశారు

జిల్లాలో ప్రముఖ శైవక్షేత్రంగా వర్ధిల్లుతున్న ఓదెల మల్లికార్జునస్వామి దేవస్థానంలో కోనేరు నిరుపయోగంగా మారటంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. 8లో▸



మాయమయ్యాయా? 8లో▸

జిల్లాలోని మల్యాల మండలం నూకపల్లి వీఆర్‌కే ఇంజనీరింగ్ కాలేజీలో ఎన్నికల సామగ్రి భద్రపర్చిన స్ట్రాంగ్‌రూమ్ తాళాలు తెరుచుకోకపోవడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

గరిష్టం/కనిష్టం
38.0/25.0

వాతావరణం

ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. పగటిపూట ఉక్కపోతగా ఉంటుంది. ఎండ తీవ్రత పెరుగుతుంది.

తల్లి పాదాల కింద స్వర్గం ఉంది.
– మహమ్మద్ ప్రవక్త

ఇఫ్తార్	సహర్
మంగళ 6:34	బుధ 4:36

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

శక్తికేంద్రాలను బలోపేతం చేయాలి



మాట్లాడుతున్న గుజ్జుల రామకృష్ణారెడ్డి

సుల్తానాబాద్: శక్తికేంద్రాలతోనే బీజేపీ అధికారంలోకొస్తుందని బీజేపీ మాజీ ఎమ్మెల్యే, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుజ్జుల రామకృష్ణారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో శక్తికేంద్రాల ముఖ్య కార్యకర్తల సమావేశం పార్టీ మండల మాజీ అధ్యక్షుడు కొమ్ము తిరుపతి యాదవ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన హామీలు అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. పార్టీ బలోపేతానికి ప్రతిఒక్కరూ కష్టపడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలోఎంపీటీసీ గడ్డం రాజమణి, కిసాన్ మోర్చ జిల్లా అధ్యక్షుడు గడ్డం మహిపాల్ రెడ్డి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఆది కేశవులు, పిన్నింటి రాజు, పట్టణ అధ్యక్షుడు ఎల్లంకి రాజన్న, ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి చాతరాజు రమేశ్ నాయకులు పాల్గొన్నారు.

విజయమే లక్ష్యంగా సమన్వయంతో పనిచేయాలి

జూలపల్లి: బీజేపీ విజయమే లక్ష్యంగా కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని గుజ్జుల కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్ రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు కంకణాల జ్యోతిబసు, పిన్నింటి రాజు, నాయకులు సంతోష్‌రెడ్డి, సంకెన్ల నర్సయ్య, మాజీ సర్పంచ్ లక్ష్మీనారాయణ, మాజీ ఎంపీటీసీ తోట మోహన్, భూసారపు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనృసింహుని ఆదాయం రూ.5.89లక్షలు



ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

జూలపల్లి: మండలంలోని శ్రీయోగానంద లక్ష్మీనృసింహుని హుండీ ఆదాయాన్ని ఆలయ ఇన్‌చార్జి ఈవో సదయ్య సమక్షంలో సోమవారం లెక్కించారు. స్వామివారి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈనెల ఒకటి నుంచి 6వరకు వచ్చిన ఆదాయాన్ని లెక్కించారు. ఇందులో రూ.5,89,187, బంగారం 7.5 గ్రాములు, వెండి 630 గ్రాములు వచ్చినట్లు సదయ్య తెలిపారు. లెక్కింపులో దేవాదాయ శాఖ జేఏ జితేందర్, సర్పంచ్ భారతి, ఆలయ ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు ఎన్టీపీసీ పెద్దపీట



సామూహిక మొక్కల పెంపకాన్ని ప్రారంభిస్తున్న ఈడీ సునిల్‌కుమార్

జ్యోతినగర్: పర్యావరణ పరిరక్షణకు ఎన్టీపీసీ రామగుండం సంస్థ పెద్దపీట వేస్తోందని ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సునిల్‌కుమార్ అన్నారు. సోమవారం సామూహిక మొక్కల పెంపకం కేంద్రాన్ని ప్రారంభిచారు. ఎన్టీపీసీ మొదటి యూనిట్–1 సింక్రనైజేషన్ క్రమంలో సామూహిక చెట్ల పెంపకం, కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా కవులు ఆలపించిన కవితలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో దీప్తి మహిళా సమితి అధ్యక్షురాలు ఉషాకుమార్, ఎగ్జిక్యూటివ్ మాజీ డైరెక్టర్ జేఎన్.సింగ్, ఆర్‌ఎఫ్‌సీఎల్ సీజీఎం ఎస్‌కే.ఝూ, ఎన్టీపీసీ సీజీఎం ప్రసేంజిత్ పాల్, జనరల్ మేనేజర్లు పుష్పేంద్రకుమార్ లాడ్, అతుల్ కమలాకర్ దేశాయ్, ఏజీఎం(హెచ్‌ఆర్) బిజయ్‌కుమార్ సిగ్దర్ పాల్గొన్నారు.

శునకాలకు అంతుచిక్కని వ్యాధి..!

- జుట్టు ఊడిపోయి.. చర్మం నిండా పుండ్లు..
- కరిస్తే ప్రమాదమని భయపడుతున్న ప్రజలు
- కొత్త వ్యాధులు వస్తాయంటూ కలవరం
- పట్టించుకోని అధికార యంత్రాంగం





అంతుచిక్కని వ్యాధితో భయకరంగా మారిన వీధికుక్కలు

సాక్షి, పెద్దపల్లి: జిల్లాలో వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉంది. కుక్కకాటులతో బెంబేలెత్తుతున్న జిల్లావాసులకు ఇప్పుడు కొత్త భయం జనాలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. ఎక్కడ చూసినా కుక్కల గుంపులు కనిపిస్తున్నాయి. వాటిని ప్రత్యేకంగా పరిశీలించి చూస్తే వాటిలో ఎక్కువ శాతం కుక్కలకు చర్మం ఊడిపోయి, శరీరమంతా మచ్చలు, పుండ్లతో ఒళ్లు జలదరించేలా సంచరిస్తూ కనిపిస్తున్నాయి. ఈవ్యాధితో కుక్కలు మానసిక స్థితిని కోల్పోయి, విచిత్రంగా ప్రవర్తిస్తూ మనుషుల మీద దాడిచేస్తున్నాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పశువులకు లంపీస్కిన్ వైరస్ సోకినట్టే.. వీధి కుక్కలు కొత్త రోగంతో (ప్యారాసైట్ ఇన్ఫెస్టేషన్‌తో) బక్కచిక్కిపోతున్నాయి. అటువంటి కుక్కలు కరిస్తే కొత్త వ్యాధులు సోకే అవకాశముందని ప్రజలు భయపడుతున్నారు.

పట్టించుకునేవారేరీ..

పశుసంవర్ధకశాఖ అధికారుల లెక్కల ప్రకారం జిల్లాలో సుమారు 3,507 వీధి కుక్కలు ఉన్నాయి. వీటిలో చాలా కుక్కలు 'ప్యారాసైట్ ఇన్ఫెస్టేషన్' రోగం బారినపడ్డట్లు వైద్యులు చెబుతున్నారు. అటువంటి కుక్కలకు ప్రతినెలా లేదా మూడు నెలలకోసారి మెడిసిన్ డీవార్మింగ్ చేయాల్సి ఉంటుంది. అలాగే గ్రోత్‌టానిక్, లివర్ టానిక్ ఇవ్వాల్సి ఉంటుంది. కేవలం ఇంట్లో పెంచుకునే పెట్ డాగ్స్ యజమానులు మాత్రమే ఇలాంటి మెడిసిన్‌లు ఇప్పిస్తున్నారు. వీధుల్లో తిరిగే వాటికి వైద్యం అందించేందుకు ప్రభుత్వ యంత్రాంగం, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రాకపోవడంతో ఇలా ఈ వింత వ్యాధితో ఆరునెలల్లో బక్కచిక్కిపోతున్నాయి. వీధి కుక్కల లెక్కలు తీసి వాటికి రేబిస్ రాకుండా టీకాలు వేయించటంతోపాటు, వాటికి ఇటువంటి వ్యాధులు రాకుండా చేయాల్సి ఉండగా ఇటు గ్రామాల్లోనూ, బల్దియాల్లోనూ ఎవరూ పట్టించుకోవటం లేదు. ఇదే అంశం మీద జిల్లా పశుసంవర్ధక శాఖ ఏడీ నారాయణ వివరణ కోరగా.. జిల్లాలో వీధికుక్కలకు వింతరోగాలు వస్తున్నట్లు తమ దృష్టికి రాలేదని, క్షేత్రస్థాయిలో సమాచారం తెలుసుకొని చర్యలు తీసుకుంటామన్నారు.

చికిత్స అందించాలి



రామగుండం కార్పొరేషన్ పరిధిలో వీధి కుక్కలు ప్రజలకు తీవ్ర ఇబ్బంది కలిగిస్తున్నాయి. ఇప్పుడు కొత్తగా బొచ్చు రాలిపోయి, చూడటానికే భయం వేసేలా కనిపిస్తున్నాయి. ఇలాంటి కుక్కలు రోడ్లపై సంచరిస్తుంటే ప్రజలు భయపడుతున్నారు. అధికారయంత్రాంగం కుక్కలకు వచ్చిన కొత్తవ్యాధిని గుర్తించి వాటికి వెంటనే చికిత్స అందించేలా చూడాలి. – ఆడెపు రాము, జంతు పేమికుడు, రామగుండం



స్వామివారి రథోత్సవం

ముగిసిన రంగనాయకస్వామి బ్రహ్మోత్సవాలు

సుల్తానాబాద్ మండలం నీరుకుల్ల–వేగురుపల్లిలోని మానేటి రంగనాయకస్వామి బ్రహ్మోత్సవాలు సోమవారంతో ముగిశాయి. అర్చకులు గోవర్ధనగిరి మనోహరాచార్యులు, రాజ్‌కుమారాచార్యులు, యాజ్ఞికులు జగన్నాథాచార్యులు, వేణుమాధవాచార్యులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు నల్ల మనోహర్‌రెడ్డి దర్శించుకున్నారు. సర్పంచ్‌లు విజేందర్‌గౌడ్, నగేష్, ఆలయ కమిటీ సభ్యులు సత్యనారాయణ, ధర్మారెడ్డి, మహేందర్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు. – సుల్తానాబాద్‌రూరల్



బారులు తీరిన భక్తులు

'ఫైన్' ప్రదర్శనలో మనోళ్లు

- తిలకించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
- విద్యార్థినులకు డీఈవో అభినందన



పూజాశ్రీ ప్రదర్శనను తిలకిస్తున్న ద్రౌపది ముర్ము

జ్యోతినగర్: రాష్ట్రపతి భవన్ సాంస్కృతిక కేంద్రం (ఆర్‌బీసీసీ) ఢిల్లీ వేదికగా నాలుగు రోజులపాటు నిర్వహిస్తున్న ప్రతిష్టాత్మక 'ఫైన్' ప్రదర్శనలో జిల్లా విద్యార్థినుల ఎగ్జిబిట్స్ విశేషంగా ఆకట్టుకున్నాయని డీఈవో మాధవి తెలిపారు. రాష్ట్రపతి భవన్‌లో ఎన్‌ఐఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ప్రతిష్టాత్మక 'ఫెస్టివల్ ఆఫ్ ఇన్నోవేషన్ అండ్ ఎంటర్ ప్రెన్యూర్ షిప్ – 2023' అట్టహాసంగా ప్రారంభమైంది. తెలంగాణ స్టాల్స్‌ను రాష్ట్రపతి ప్రత్యేకంగా తిలకించారు. జిల్లాలోని చందనాపూర్ జెడ్పీ పాఠశాల విద్యార్థిని దాసరి హర్షిత, సుల్తానాబాద్ అల్ఫోర్స్ ఉన్నత పాఠశాల విద్యార్థిని ముస్త్యాల పూజాశ్రీ ప్రదర్శనలను తిలకించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కేంద్ర శాస్త్రసాంకేతిక శాఖ మంత్రి జితేంద్ర సింగ్, డీఎస్‌టీ కార్యదర్శి ప్రొఫెసర్ ఎస్.చంద్రశేఖర్, నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ సంచాలకులు అరవింద్ సి.రానడే, 60 మంది విద్యార్థులు పాల్గొంటున్నారని, రాష్ట్రం నుంచి 8 మంది పాల్గొంటుండగా జిల్లా నుంచి ఇద్దరు విద్యార్థినులు హాజరయ్యారని డీఈవో పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి బి.రవినందన్ రావు, గైడ్ టీచర్ సంపత్ కుమార్ పాల్గొన్నారు.

నిరుద్యోగులపై చిత్తశుద్ధి ఎక్కడ..?

- నయా నాటకాల్లో మంత్రి హరీశ్‌రావు దిట్ట
- దుబ్బాక బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్ రావు



మాట్లాడుతున్న బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్ రావు

సుల్తానాబాద్: నిరుద్యోగులపై రాష్ట్రప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని దుబ్బాక బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్ రావు అన్నారు. జిల్లాకేంద్రంలో సోమవారం పార్టీ జిల్లా అధ్యక్షుడు రావుల రాజేందర్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఇప్పటివరకు సిట్ ఎన్ని కేసులు పరిష్కరించిందో చెప్పాలని, నయీం కేసు, ఇంటర్ విద్యార్థుల ఆత్మహత్య కేసు, నిజామాబాద్‌లో వాణిజ్య పన్నుల శాఖ చెక్ పోస్టుల అక్రమ కేసుల్లో ఏం తేల్చారని ప్రశ్నించారు. బిల్లులపై గవర్నర్ సంతకం పెట్టకుంటే బీజేపీని బద్నాం చేయడం ఎందుకన్నారు. గవర్నర్‌తో సత్సంబంధాలు తెంచుకున్నది రాష్ట్ర ప్రభుత్వమేనని పేర్కొన్నారు. 2014 నుంచి నోటిఫికేషన్లు ఇవ్వని సర్కారు.. టీఎస్‌పీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చి లీక్ చేసిందన్నారు. ఏటా డీఎస్సీ నియామకాలు చేపట్టాల్సి ఉన్నా.. ఎందుకు చేపట్టడం లేదన్నారు. లీకేజీ నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకే మంత్రి హరీశ్‌రావు బీజేపీని బదనాం చేస్తున్నారని మండిపడ్డారు. చదువు, సంస్కారం గురించి బీజేపీకి నేర్పాల్సిన అవసరం లేదన్నారు. యూనివర్సిటీలు, కామన్ రిక్రూట్‌మెంట్ బోర్డులు ఇప్పుడు గుర్తుకొచ్చాయా అని ప్రశ్నించారు. ఆయన వెంట కౌన్సిలర్ మహంత కృష్ణ, నాయకులు పర్వతాలు, దాడి సంతోష్, తంగెడ రాజేశ్వర్ రావు, ఉప్పు కిరణ్ తదితరులు ఉన్నారు.

చిన్నకల్వల సంఘం జిల్లాకే ఆదర్శం

- కేడీసీసీ బ్యాంక్ సీఈఓ సత్యనారాయణ



మాట్లాడుతున్న చైర్మన్ మోహన్‌రావు

సుల్తానాబాద్‌రూరల్: చిన్నకల్వల, సుల్తానాబాద్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు జిల్లాకే ఆదర్శంగా నిలుస్తున్నాయని, కేడీసీసీ బ్యాంక్ సీఈఓ సత్యనారాయణ అన్నారు. చిన్నకల్వల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో రూ.19.60లక్షలతో నిర్మించిన సమావేశ మందిరం, చైర్మన్ క్యాబిన్, డైనింగ్ హాల్‌ను ఎంపీపీ బాలాజీరావుతో కలిసి సోమవారం ప్రారంభించారు. సంఘ సభ్యులకు రుణాలు ఇవ్వడం, అభివృద్ధి మార్గాలు ఎంచుకుని వాటాధనం పెంచుకోవడం, డిపాజిట్లను సేకరించడం బాగుందన్నారు. ఎంపీపీ మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. చైర్మన్ దేవరనేని మోహన్‌రావు మాట్లాడుతూ రైతులు ఇబ్బంది పడకుండా రెండు, మూడు గ్రామాలకో గోదాం నిర్మించి ఎరువులు అందిస్తున్నామని తెలిపారు. గోల్డ్ లోన్, లాకర్ సదుపాయం కల్పించాలని సంఘం సీఈఓ రమేశ్ బ్యాంక్ సీఈఓ తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించారు. సర్పంచ్ రమేష్‌గౌడ్, వైస్ చైర్మన్ రాజు, డైరెక్టర్లు, తదితరులున్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో 'సోలార్' ప్రారంభం



సోలార్ పవర్‌ను ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్ మధు

రామగిరి: మండలంలోని రాజాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటు చేసిన సోలార్ పవర్‌ను సోమవారం జెడ్పీ చైర్మన్ పుట్ట మధు ప్రారంభించారు. నియోజకవర్గంలోని 27 కేంద్రాల్లో రూ.35లక్షలతో సోలార్ పవర్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సింగరేణి భూసేకరణలో భాగంగా శివారు వ్యవసాయ భూములకు జారీ చేసిన అవార్డు రద్దు కావడంతో రైతులకు కొత్త పట్టాపాస్ పుస్తకాలు ఇప్పించాలని సర్పంచ్ ఓదెలు కోరారు. సర్పంచ్ పాశం ఓదెలు, జెడ్పీటీసీ శారద, వైస్ ఎంపీపీ శ్రీదేవి, ఎంపీడీవో రమేశ్, ఎంపీవో భాస్కర్, ఏఈ మల్లేశం, టీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శంకేసి రవీందర్ పాల్గొన్నారు.

ప్రజావాణికి వినతుల వెల్లువ

- అర్జీలు స్వీకరించిన కలెక్టర్ సంగీత
- పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ సంగీత

జ్యోతినగర్: సమస్యలు పరిష్కరించాలంటూ ప్రజలు అందించే అర్జీలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ సంగీత సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యత కల్పించాలని, తిరస్కరించిన వాటికి వివరణ ఇవ్వాలని సూచించారు. ప్రజావాణిలో మొత్తం 51 దరఖాస్తులు రాగా.. అందులో 36 రెవెన్యూ సంబంధిత సమస్యలే ఉన్నాయి. మరో 15 ఇతర శాఖలకు చెందినవి ఉన్నాయి.

- రామగుండం శివాజీనగర్‌కు చెందిన కుడికాల శ్రీనివాస్ తన కుమార్తె వైష్ణవి పక్షవాతం, బ్రెయిన్ టీబీతో బాధపడుతోందని, సదరం సర్టిఫికెట్ ఇప్పించి దివ్యాంగుల పెన్షన్ మంజూరు చేయాలని కోరారు.
- ముత్తారం మండలం మచ్చుపేట ప్రజలు తమ గ్రామంలోని పురాతన బగుళ్ల ఆలయాన్ని దేవాదాయ శాఖలో చేర్చి విద్యుత్ సౌకర్యం కల్పించాలని, అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరారు.
- అంతర్గాం మండలం గోలివాడకు చెందిన పలువురు రైతులు సర్వే నంబర్ 502లోని గోలివాడ పంప్ హౌస్ కాలువలకు గండ్లు ఏర్పడి పంట పొలాలకు నష్టం వాటిల్లుతోందని ఫిర్యాదు చేశారు. దీనికి నీటిపారుదల శాఖ అధికారి, అంతర్గాం తహసీల్దార్ సంయుక్తంగా పరిశీలించి ఈనెల 20 నాటికి సమగ్ర నివేదిక సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు.
- రామగుండంలోని ప్రశాంత్‌నగర్‌కు చెందిన తిప్పని రాజ్యలక్ష్మి తమకు జీఓ 76 కింద మంజూరు చేసిన పట్టాలో పేరు తప్పుగా ప్రచురితం అయిందని, సరి చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకున్నారు.

కార్మికులకు రావాల్సిన బెనిఫిట్స్ ఇప్పించండి



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న కైలాసం

సుల్తానాబాద్: లేబర్ కార్యాలయం నుంచి కార్మికులకు రావాల్సిన బెనిఫిట్స్ వెంటనే ఇప్పించాలని దళిత లేబర్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు బొంకూరి కైలాసం కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందించారు. భవన నిర్మాణ కార్మికులకు లేబర్ ఇన్సూరెన్స్ కార్డులు ఇప్పించామని, చనిపోయిన మంథని లక్ష్మి కుటుంబానికి ప్రభుత్వ సహాయం అందలేదని, తిప్పారపు లక్ష్మి డెలివరీ, సంతోషమ్మ పెళ్లికి సంబంధించిన బెనిఫిట్స్ రెండేళ్లయినా రావడం లేదని పేర్కొన్నారు. స్పందించిన కలెక్టర్ వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

స్థలాల క్రమబద్ధీకరణపై అపోహలు తొలగించాలి

గోదావరిఖని: సింగరేణి స్థలాల క్రమబద్ధీకరణపై ప్రజల్లో ఉన్న అపోహలు తొలగించాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి గోదావరిఖని ప్రాంతానికి వచ్చిన సమయంలో కాంగ్రెస్ నాయకుల కోరిక మేరకు స్థలాల క్రమబద్ధీకరణకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారని, రెవెన్యూ యంత్రాంగంతో సర్వే చేయించి, దాదాపు 27వేల కార్మిక కుటుంబాలకు పట్టాలు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారని పేర్కొన్నారు. అయితే రామగుండం ఎమ్మెల్యే వైఎస్సార్ ఇచ్చిన పట్టాలు చెల్లవంటున్నారని తెలిపారు. ఈ విషయంలో కలగజేసుకుని స్పష్టమైన ప్రకటన విడుదల చేసి 18వేల మంది లబ్ధిదారుల అనుమానాలు నివృత్తి చేయాలని నాయకులు బొంతల రాజేశ్, మాదరబోయిన రవికుమార్, కార్పొరేటర్లు కోరారు.

క్లుప్తంగా

మందుబాబులకు అడ్డాగా బస్టాండ్



నిరుపయోగంగా బస్టాండ్

రామగుండం: పట్టణంలోని ఎ-పవర్‌హౌస్ ఎదుట ఉన్న ఆర్టీసీ బస్టాండ్ నిరుపయోగంగా మారింది. గోదావరిఖని నుంచి అంతర్గాం, పొట్యాల, ముర్మూర్, ధర్మారం, జగిత్యాల వెళ్లే బస్సులను ఇక్కడ నిలపాల్సి ఉంది. కానీ ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తయ్యాక ఆ ప్రదేశంలో ప్రయాణికులు ఉండటం లేదు. మసీదు కార్నర్ వద్ద ప్రయాణికులను బస్సులో ఎక్కించుకొని, బస్టాండు ఎదుట నుంచి వెళ్తున్నప్పటికీ ప్రాంగణంలోకి వెళ్లే అవకాశం లేకపోవడంతో నిరూపయోగంగా మారింది. ఫలితంగా సదరు బస్టాండ్ రాత్రి వేళల్లో మందుబాబులకు, సంచార జాతుల వారికి అడ్డాగా మారింది. దీనిపై ఆర్టీసీ యాజమాన్యం దృష్టి సారించి, బస్టాండ్‌ను వినియోగంలోకి తీసుకురావాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి



సభలో మాట్లాడుతున్న రమేశ్

గోదావరిఖని(రామగుండం): ప్రజాసమస్యల పరిష్కారం కోసం అహర్నిశలు కృషి చేస్తామని తెలంగాణ లేబర్ పార్టీ అధ్యక్షుడు గొర్రె రమేశ్ అన్నారు. ఆదివారం రాత్రి గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో ఏర్పాటు చేసిన సభలో ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. తాను నిర్వహించిన బస్తీబాట, పల్లెబాట కార్యక్రమాలకు ప్రజల నుంచి స్పందన లభించిందన్నారు. వారు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై డాక్యుమెంటరీ నోట్ తయారు చేశామని పేర్కొన్నారు. తెలంగాణ లేబర్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో నిలుస్తున్న తనను గెలిపిస్తే ఈ ప్రాంత అభివృద్ధికి కట్టుబడి ఉంటానన్నారు. సమావేశంలో నాయకులు నూనె రాజేశం, కళాధర్‌రెడ్డి, చంద్రకళ, జూపాక శ్రీనివాస్, మాలెం మధు, గుమ్మడి వెంకన్న, ఏలేశ్వరం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆయన నేత్రాలు సజీవం



శంకర్ (ఫైల్)

కోల్‌సిటీ(రామగుండం): గోదావరిఖని జీఎం కాలనీకి చెందిన సింగరేణి కార్మికుడు పెసరి శంకర్(54) సోమవారం ఉదయం గుండెపోటుతో మృతిచెందాడు. ఇంటి పెద్ద దిక్కును కోల్పోయిన కుటుంబసభ్యులు పుట్టెడు దుఃఖంలోనూ ఆయన నేత్రాలను దానం చేసేందుకు ముందుకువచ్చారు. సదాశయ ఫౌండేషన్ జనరల్ సెక్రటరీ సీహెచ్.లింగమూర్తి, ఉపాధ్యక్షుడు రాజమౌళి ఆధ్వర్యంలో శంకర్ నేత్రాలను సేకరించి, హైదరాబాద్‌లోని వాసన్ ఐ బ్యాంక్‌కు తరలించారు.

ఓదెలలో కోనేరు.. నిర్మించారు.. వదిలేశారు

- మోటార్లు, నీటి పంపింగ్ ఏర్పాట్లు లేవు
- తాగునీటి ట్యాంకు వద్దే స్నానాలు
- కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో భక్తుల ఇబ్బందులు



ఓదెల మల్లన్న సన్నిధిలో నిర్మించిన కోనేరు

ఓదెల(పెద్దపల్లి): జిల్లాలో ప్రముఖ శైవక్షేత్రంగా వర్ధిల్లుతున్న ఓదెల మల్లికార్జునస్వామి దేవస్థానంలో కోనేరు నిరుపయోగంగా మారటంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. మల్లన్న సన్నిధిలో కోనేరు నిర్మాణానికి రూ.30 లక్షలు మంజురయ్యాయి. ఇటీవల ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ మేకల మల్లేశంయాదవ్‌ల ఆధ్వర్యంలో వేదమంత్రోచ్ఛరణల మధ్య కోనేరును అట్టహాసంగా ప్రారంభించారు. అయితే కాంట్రాక్టర్ కేవలం కోనేరును నిర్మించి, పంపింగ్ సిస్టం, మోటార్లను ఏర్పాటు చేయలేదు. దీంతో అందులో వర్షపు నీరు, చెత్తాచెదారం చేరింది. దీంతో తాము కోనేటి స్నానానికి నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వేల సంఖ్యలో భక్తుల రాక..

మల్లికార్జునస్వామి వారి బ్రహ్మోత్సవాలకు, శ్రీరామనవమి సందర్భంగా కల్యాణం తిలకించేందుకు వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. నిరుపయోగంగా ఉన్న కోనేరును చూసి, వారు నైరాశ్యం చెందారు. ప్రస్తుతం ఉగాది రోజు నుంచి ఓదెల మల్లన్న జాతర ఊపందుకుంది. ప్రతీ ఆది, బుధవారాలతోపాటు నిత్యం జరిగే జాతర, స్వామివారి దర్శనం కోసం వస్తున్న భక్తులు మంచినీటి ట్యాంకుల కింద స్నానం చేస్తున్నారు. ట్యాంకుల వద్ద ఎక్కువ మంది ఉంటే చుట్టుపక్కల వ్యవసాయ బావుల వద్దకు వెళ్తున్నారు. అధికారులు స్పందించి, కోనేటి స్నానానికి ఏర్పాట్లు చేయాలని భక్తులు కోరుతున్నారు.

40 ఏళ్లుగా వస్తున్న..



నమ్మిన దేవుడిగా మల్లన్న దర్శనం కోసం 40 ఏళ్లుగా కుటుంబంతో కలిసి వస్తున్న. మంచినీటి ట్యాంకు వద్ద స్నానం చేస్తున్నం. భక్తులు రద్దీ ఎక్కువైతే వ్యవసాయ బావుల వద్దకు వెళ్తున్నాం. – ఓదెలు, భక్తుడు, రేగడిమద్దికుంట

ఇబ్బంది పడుతున్నం..



ఓదెల మల్లన్న దర్శనానికి వచ్చినప్పుడల్లా ట్యాంకు నీటితో స్నానం చేస్తున్నాం. చుట్టూ జనం ఉంటరు. ఆడవాళ్లం ఇబ్బంది పడుతున్నం. కొందరు పొలాల వద్దకు వెళ్లి, స్నానం చేసి, వస్తున్నరు. – లక్ష్మి, భక్తురాలు, కేశనపల్లి

కోనేరును పూర్తి చేయాలి



కోనేరును వెంటనే పూర్తి చేయాలి. ప్రస్తుతం నీళ్లు లేకపోవడంతో వెలవెలబోతుంది. స్నానానికి భక్తులు ఇబ్బంది పడుతున్నరు. సర్కారు పట్టించుకొని, కోనేరులో నీటిని నింపాలి. – రాయమల్లమ్మ, భక్తురాలు, కురిక్యాల

మోటార్ కార్మికులకు పథకాలు వర్తింపజేయాలి



నూతన కార్యవర్గ సభ్యులు

జ్యోతినగర్(రామగుండం): మోటార్ కార్మికుల సమస్యలు ఐఎఫ్‌టీయూతోనే పరిష్కారమవుతాయని రామగుండం ఏరియా మోటారు వర్కర్స్ యూనియన్(ఐఎఫ్‌టీయూ) వర్కింగ్ ప్రెసిడెంట్ చిలుక శంకర్ అన్నారు. ఆటోనగర్‌లోని యూనియన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మోటార్ రంగంలోని కార్మికులకు ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సంక్షేమ బోర్డు, జాతీయ రహదారుల వెంట పార్కింగ్ ఏర్పాటు చేయాలని, దొంగతనాలు, దోపిడీలు, హత్యలు జరగకుండా రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. దురదృష్టవశాత్తు ఇతర రాష్ట్రాల్లో ఏదైనా ప్రమాదం జరిగితే కేసులకు అక్కడికి వెళ్లాల్సి రావడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఆ కేసులను సొంత రాష్ట్రంలోని జిల్లాల కోర్టులకు బదలాయించాలని, డ్రైవింగ్ లైసెన్స్‌ను బట్టి జీవనోపాధి కోసం బ్యాంకుల ద్వారా రుణాలు అందించాలని, మధ్యతరగతి ఓనర్ కం డ్రైవర్లకు ఫైనాన్స్ అధికారుల నుంచి విజ్ఞప్తి చేశారు. సమస్యల పరిష్కారం కోసం కార్మికులు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

నూతన కార్యవర్గ నియామకం..

రామగుండం ఏరియా మోటార్ వర్కర్స్ యూనియన్(ఐఎఫ్‌టీయూ) నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. గౌరవ అధ్యక్షుడిగా కె.రాజన్న, అధ్యక్షుడిగా ఈ.నరేష్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా చిలుక శంకర్ ఇతర కార్యవర్గ సభ్యులను నియమించారు.

'ఎల్లంపల్లి'లో టూరిజం బోట్‌పై నిర్లక్ష్యం



నీటిలో పడేసిన బోట్

రామగుండం: గోదావరినదిలో పర్యాటకులకు ఆహ్లాదం పంచేందుకు రెండేళ్ల క్రితం పర్యాటక శాఖ ఏర్పాటు చేసిన బోట్‌ను ఎల్లంపల్లి ప్రాజెక్టు నీటిలో నిర్లక్ష్యంగా పడేశారు. ప్రస్తుతం వేసవి సీజన్‌లో ఈ ప్రాజెక్టును వీక్షించేందుకు సాయంత్రం వేళ పిల్లలతో చాలామంది పర్యాటకులు వచ్చే అవకాశం ఉంది. ఈ క్రమంలో నిరుపయోగంగా మారిన టూరిజం బోట్‌కు మరమ్మతు చేయించి, వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు. బోట్‌ను తిప్పితే పర్యాటక శాఖకు ఆదాయం సమకూరే అవకాశం ఉంటుందని అంటున్నారు. దీనిపై సంబంధిత అధికారులు స్పందించి, చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మికుడికి సన్మానం

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ రామగుండం సంస్థలో ఉద్యోగ విరమణ పొందుతున్న కాంట్రాక్టు కార్మికుడిని ఘనంగా సన్మానించారు. సోమవారం మేడిపల్లి సెంటర్ సాయి సేవా సమితిలో కార్యక్రమం నిర్వహించారు. ప్లాంటులోని సీహెచ్‌పీ లొకేషన్‌లో విధులు నిర్వహిస్తున్న భూమయ్య ఉద్యోగ విరమణ పొందుతున్న నేపథ్యంలో ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి భూమల్ల చందర్ ఆయనను శాలువాతో సత్కరించారు. కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ఐఎన్‌టీయూసీ అగ్రభాగాన నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో దేవేందర్‌రెడ్డి, శేఖర్, లింగయ్య, శంకర్, నవీన్, శంకర్, సుదర్శన్, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

టీటీడీకి రూ.40,016 విరాళం

సుల్తానాబాద్(పెద్దపల్లి): మున్నూరు కాపు యువజన సంఘం రాష్ట్ర కన్వీనర్ ఆకుల స్వామి వివేక్ పటేల్ తిరుమల తిరుపతి దేవస్థానానికి రూ.40,016 విరాళం ప్రకటించారు. ఈ మొత్తాన్ని సోమవారం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణ కమిటీ ట్రస్టుకు పంపించారు. జిల్లా కేంద్రంలో స్థానిక నాయకులు ఆయనను సన్మానించారు.

దాడి కేసులో బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడి రిమాండ్

రామగిరి(మంథని): నాగేపల్లికి చెందిన పోలు మధుపై దాడి చేసి, గాయపర్చిన బీఆర్ఎస్ రామగిరి మండల యూత్ అధ్యక్షుడు కొండవేన సుధాకర్‌ను సోమవారం అరెస్టు చేసినట్లు ఎస్సై కటికె రవిప్రసాద్ తెలిపారు. అతన్ని కోర్టులో హాజరుపర్చగా మెజిస్ట్రేట్ 14 రోజుల రిమాండ్ విధించారని పేర్కొన్నారు. ఎస్సై వివరాల ప్రకారం.. గత నెల 22న ఉగాది పర్వదినం రోజు నాగేపల్లిలోని ఎ-బ్లాక్‌లో సీసీరోడ్డు వేస్తున్నారు. ఓ దినపత్రికలో విలేకరిగా పని చేస్తున్న మధు ఫొటోలు తీస్తున్నాడు. ఆ సమయంలో అక్కడే ఉన్న నాగేపల్లి సర్పంచ్ కొండవేన ఓదెలుయాదవ్ కుమారులు ప్రభాకర్, సుధాకర్‌లు తనపై అకారణంగా దాడి చేసి, గాయపర్చారని మధు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు దాడి కేసులో రిమాండ్ కావడం మండలంలో చర్చనీయాంశంగా మారింది.

బొగ్గుబాయి వార్తలు

కార్మికులకు శుద్ధజలం అందించాలి



ఫిల్టర్ బెడ్‌ను పరిశీలిస్తున్న శ్రీనివాస్, అధికారులు

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): ఆర్జీ–2 ఏరియాలోని సింగరేణి కుటుంబాలకు శుద్ధజలం అందించాలని టీబీజీకేఎస్ ఆర్జీ–2 వైస్ ప్రెసిడెంట్ ఐలి శ్రీనివాస్ అన్నారు. సోమవారం ఆర్జీ–2 పరిధి యైటింక్లయిన్‌కాలనీలోని ఫిల్టర్ బెడ్‌ను పరిశీలించి, మాట్లాడారు. వారం రోజులుగా కాలనీ కార్మిక కుటుంబాలకు సరఫరా చేస్తున్న తాగునీరు పసుపుపచ్చ రంగులో వస్తోందన్నారు. ఫలితంగా వారు వాంతులు, విరోచనాలు, జాండిస్, శరీరంపై దుద్దుర్లు వంటి సమస్యలతో బాధ పడుతున్నారని పేర్కొన్నారు. మంచినీటి సరఫరా విషయంలో సింగరేణి అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. గతంలోనూ ఇదే పరిస్థితి వచ్చిందని గుర్తు చేశారు. ఇప్పటికైనా యాజమాన్యం స్పందించి, శుద్ధమైన తాగునీరు అందించాలని కోరారు. లేకపోతే కార్మిక కుటుంబాలతో కలిసి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సింగరేణి సివిల్ అధికారులు రాజు, రాధాకృష్ణ, నాయకులు ప్రభాకర్ రెడ్డి, శ్రీనివాస్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి ఉద్యోగులకు క్వార్టర్ల కేటాయింపు

గోదావరిఖని(రామగుండం): కౌన్సెలింగ్ ద్వారా సింగరేణి ఉద్యోగులకు క్వార్టర్లను కేటాయించారు. సోమవారం ఆర్జీ–2 ఏరియా సీఈఆర్ క్లబ్‌లో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఆర్జీ–3 జీఎం కార్యాలయం, అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్టు, ఓసీపీ–2 ఉద్యోగుల్లో ఇంతవరకు క్వార్టర్ లేనివారితోపాటు ఇప్పటికే క్వార్టర్లు ఉన్న వారికి చేంజ్ ఆఫ్ క్వార్టర్స్ పేరిట కౌన్సెలింగ్ జరిపినట్లు చెప్పారు. మొత్తం 1,012 క్వార్టర్లకు గాను 118 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకోగా 70 మంది హాజరయ్యారు. 54 మందికి సీనియారిటీ ప్రకారం క్వార్టర్లను కేటాయించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్వోటూ జీఎం అబ్దుల్‌సలీం, టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు ఐలి శ్రీనివాస్, డీజీఎం పర్సనల్ రాజేంద్రప్రసాద్, సీనియర్ పీవో వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

లాంగ్ స్టాండింగ్ అధికారులను బదిలీ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణ

గోదావరిఖని(రామగుండం): సింగరేణిలో ఒకే ప్రాంతంలో ఎక్కువ ఏళ్లు పని చేస్తున్న లాంగ్ స్టాండింగ్ అధికారులను వెంటనే బదిలీ చేయాలని గోదావరి లోయ బొగ్గుగని కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఐ.కృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం గోదావరిఖనిలోని యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొన్నేళ్లపాటు ఒకే పోస్టింగ్‌లో అధికారులు పని చేయడం వల్ల అజమాయిషీ పెరిగి, అవకతవకలు జరుగుతున్నాయని తెలిపారు. రాజకీయ నాయకులు, యూనియన్ నేతల అండదండలతో అధికార దుర్వినియోగం చేస్తున్నారని మండిపడ్డారు. సంస్థ నిబంధనల ప్రకారం మూడు లేదా ఐదేళ్ల కన్నా ఎక్కువ సమయం ఒకేచోట పనిచేసే అధికారులను గుర్తించి, బదిలీ చేయాలన్నారు. జిల్లా అధ్యక్షుడు ఇ.నరేష్, నాయకులు ఎం.కొమురయ్య, బాబు, యూసుఫ్, కె.మొగిలి, ఎ.చంద్రయ్య, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

యువతకు నిరుద్యోగ భృతి ఇవ్వాలి

- ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న జనక్‌ప్రసాద్

గోదావరిఖని(రామగుండం): పోటీ పరీక్షలు వాయిదా పడిన నేపథ్యంలో యువత ఆత్మస్థైర్యం దెబ్బతినకుండా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ భృతి ఇవ్వాలని ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్ డిమాండ్ చేశారు. సోమవారం గోదావరిఖనిలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో సుమారు 22 లక్షల మంది నిరుద్యోగులు ఉన్నారని తెలిపారు. అప్పు చేసి, కోచింగ్ సెంటర్ల చుట్టూ తిరుగుతున్నారని పేర్కొన్నారు. పేపర్ల లీక్ ఘటన వారిని తీవ్ర ఆందోళనకు గురిచేస్తోందని అన్నారు. గతంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన హామీ ప్రకారం నిరుద్యోగ భృతి అందించి, ఆదుకోవాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ, యువతకు నిరుద్యోగ భృతి ఇవ్వడం లేదా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. నాయకులు గుమ్మడి కుమారస్వామి, నర్సింహారెడ్డి, ధర్మపురి, లక్ష్మీపతిగౌడ్, వికాస్‌కుమార్, రాజేందర్, ఆరెపల్లి శ్రీనివాస్, ఎట్టెం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గోదావరినదిలో యువకుడి మృతదేహం



రాజేశ్ (ఫైల్)

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): కనిపించకుండా పోయిన గోదావరిఖని ద్వారకానగర్‌కు చెందిన ఎర్రోజు రాజేశ్ (34) ఇటుక బట్టీల సమీపంలో గోదావరినదిలో చనిపోయి కనిపించాడు. గోదావరిఖని టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజేశ్ గోదావరిఖని లక్ష్మీనగర్‌లో గోల్డ్ షాపు నడుపుకుంటూ జీవిస్తున్నాడు. మద్యానికి బానిసై, దుకాణం అమ్ముకున్నాడు. అతిగా మద్యం తాగడం వల్ల అనారోగ్యానికి గురయ్యాడు. మూడు నెలల క్రితం ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి, వైద్య పరీక్షలు చేయించుకున్నాడు. లివర్ చెడిపోయిందని వైద్యులు చెప్పడంతో నెల రోజుల పాటు మద్యానికి దూరంగా ఉన్నాడు. ఆ తర్వాత మళ్లీ తాగడం మొదలుపెట్టడంతో కుటుంబంలో గొడవలు జరుగుతున్నాయి. రాజేశ్‌ను అనారోగ్యంతోపాటు ఆర్థిక ఇబ్బందులు వెంటాడటంతో జీవితంపై విరక్తి చెందాడు. ఈ క్రమంలో గత శనివారం తన స్నేహితుడి బైక్ తీసుకొని, అర్ధరాత్రి సమయంలో గోదావరి బ్రిడ్జి వద్దకు వెళ్లాడు. అక్కడ వాహనాన్ని పార్కింగ్ చేసి, నదిలో దూకాడు. బైక్ బ్యాగులో ఉన్న అతని ఆధార్ కార్డు ఆధారంగా పోలీసులు రాజేశ్‌గా గుర్తించారు. మృతుడి భార్య సరిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ వేణుగోపాల్, ఎస్సై శ్యాంపటేల్ తెలిపారు. కాగా మృతుడికి నాలుగేళ్ల బాబు, రెండేళ్ల పాప ఉన్నారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి వృద్ధురాలి మృతి

కమాన్‌పూర్(మంథని): మండల కేంద్రంలోని కిష్టంపల్లెకు చెందిన లింగారి లస్మమ్మ(55) బావిలో పడి మృతి చెందింది. వివరాల్లోకి వెళ్తే.. సోమవారం ఉదయం లస్మమ్మ ఇంటి ముందున్న చేదబావిలో పిల్లి పడింది. దీంతో ఆమె బకెట్‌కు తాడుకట్టి, పిల్లిని బయటకు తీస్తుండగా ప్రమాదవశాత్తు బావిలో పడి చనిపోయింది. మృతురాలి కుమారుడు శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై షేక్‌మస్తాన్ పేర్కొన్నారు.

మాయం చేశారా.. మాయమయ్యాయా?

- మిస్సయిన స్ట్రాంగ్‌రూమ్ తాళపు చెవులు!
- ఐదు గంటలపాటు అధికారుల అవస్థలు

జగిత్యాల: జిల్లాలోని మల్యాల మండలం నూకపల్లి వీఆర్‌కే ఇంజినీరింగ్ కాలేజీలో ఎన్నికల సామగ్రి భద్రపర్చిన స్ట్రాంగ్‌రూమ్ తాళాలు తెరుచుకోకపోవడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అధికారుల నిర్లక్ష్యం ఉందని కొందరు, సాంకేతిక కారణాలు అయి ఉండొచ్చని అధికారులు, కావాలనే ఇలా చేస్తున్నారని బాధితుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పరస్పర ఆరోపణలకు దిగడం ఇందుకు బలం చేకూర్చుతున్నాయి. అయితే, తాళపు చెవులు కావాలనే మార్చారా? లేక మాయం చేశారా? లేక నిర్లక్ష్యంగా వ్యవహరించారా? లేక మరోదైనా కారణం ఉందా? అనేదానిపై జిల్లావ్యాప్తంగా చర్చ జోరందుకుంది.

వివాదాస్పదమైన స్వల్ప ఆధిక్యం..

జిల్లాలోని ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గానికి 2018లో జరిగిన ఎన్నికల కౌంటింగ్‌ను మల్యాల మండలం నూకపల్లి వీఆర్‌కే ఇంజినీరింగ్ కళాశాలలో చేపట్టారు. కాంగ్రెస్ అభ్యర్థి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌పై టీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ స్వల్ప ఆధిక్యం(441ఓట్ల మెజారిటీ)తో గెలుపొందారు. అయితే, కౌంటింగ్‌లో అక్రమాలు చోటుచేసుకున్నాయని పేర్కొంటూ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ హైకోర్టును ఆశ్రయించారు. ఈమేరకు అవసరమైన డాక్యుమెంట్లను హైకోర్టుకు మంగళవారం సమర్పించాల్సి ఉంది.

స్ట్రాంగ్‌రూముల్లో ఏముంది?

- మల్యాల మండలం నూకపల్లి వీఆర్‌కే ఇంజినీరింగ్ కాలేజీ(మూతపడ్డది)లోని మూడు గదుల్లో ఎన్నికల సామగ్రి భద్రపర్చారు.
- మొదటి గదిలో 001 నుంచి 107వ నంబరు వరకు, రెండోగదిలో 108 నుంచి 269వ నంబరు వరకు ఈవీఎంలు భద్రపర్చారు.
- మూడోగదిలో సీసీ కెమెరాలు, సీసీ ఫుటేజీలు, వీవీప్యాడ్లు, పలు డాక్యుమెంట్లు, ఇతర ఎన్నికల సామగ్రి ఉంచారు.
- సోమవారం కలెక్టర్ యాస్మిన్ బాషా నేతృత్వంలో మొదటి, రెండో గది తాళాలు తీయగా, అందులోని ఈవీఎంలు కనిపించాయి.
- ఆ తర్వాత మూడోగది తాళం తీసేందుకు యత్నించగా అది మొరాయించింది.
- ఇక్కడే అసలు సమస్య మొదలైంది. మూడోగది తాళపు చెవి పనిచేయలేదా?లేక దానిస్థానంలో మరోటి తీసుకొచ్చారా? కావాలనే ఎవరైనా ఇలా చేశారా? లేక సాంకేతిక సమస్యలు ఏమైనా ఉన్నాయా? అనే సందేహాలు వ్యక్తమయ్యాయి.

అధికారుల అవస్థలు..

కోర్టు అడిగిన 17ఏ, 17సీ సీసీ ఫుటేజీల రికార్డులు, డాక్యుమెంట్ల కోసం కలెక్టర్ యాస్మిన్ బాషా నేతృత్వంలో అదనపు కలెక్టర్, ఆర్డీవోలు, అప్పటి ఎన్నికల అధికారి భిక్షపతి సోమవారం నూకపల్లి వెళ్లారు. అక్కడి మొదటి స్ట్రాంగ్‌రూమ్ తాళాన్ని 786006 నంబరు 'కీ'తో తెరిచారు. రెండో గది తాళాన్ని కూడా 786402 నంబరు 'కీ'తో తెరిచారు. కానీ, 17ఏ, 17సీ సీసీ ఫుటేజీల రికార్డులు, డాక్యుమెంట్లు భద్రపర్చిన గది తాళాన్ని 786051 నంబరు 'కీ'తో తెరిచేందుకు యత్నించినా అది ఎంతకూ ఓపెన్ కాలేదు. దాదాపు ఐదు గంటలపాటు అధికారులు నానాతంటాలు పడినా తాళం తెరుచుకోలేదు. దీనిపైనే పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



స్ట్రాంగ్‌రూమ్ తాళం తెరిచేందుకు ప్రయత్నిస్తున్న అధికారి

ప్రతినెలా 3వ తేదీన తనిఖీ

స్ట్రాంగ్‌రూమ్ గదులను ప్రతినెలా మూడోతేదీన కలెక్టర్ నేతృత్వంలో అధికారులు తనిఖీ చేస్తూ ఉన్నారు. తొలుత 2018లో అప్పటి కలెక్టర్ శరత్ ప్రతినెలా మూడోతేదీన స్ట్రాంగ్‌రూములు తనిఖీ చేశారు. ఆ తర్వాత గుగులోతు రవి, ప్రస్తుతం షేక్ యాస్మిన్‌బాషా కూడా తరచూ గదులు తనిఖీ చేస్తున్నారు. కానీ, ఎవరూ తాళాలు తెరిచిచూడలేదు. కలెక్టర్లు బదిలీపై వెళ్లిన ప్రతీసారి ఇక్కడకు వచ్చే కలెక్టర్‌కు స్ట్రాంగ్‌రూమ్ తాళపు చెవులు అప్పగించాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఒకగది తాళపుచెవి పనిచేయకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

'అడ్లూరి' ఆందోళన..

మూడుగది(స్ట్రాంగ్‌రూమ్) తాళం తెరుచుకోక పోవడంపై కాంగ్రెస్ అభ్యర్థి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. తాళం పగులగొడతామని ఉన్నతాధికారులు చెప్పడంతో అడ్లూరి అభ్యంతరం వ్యక్తం చేశారు. అధికారులపై ఆయన తీవ్రఆగ్రహం వ్యక్తం చేశారు. హైకోర్టు దృష్టికి తీసుకెళ్లాక తుది నిర్ణయం తీసుకోవాలని ఆయన అధికారులను కోరారు. దీంతో ఐదు గంటలపాటు అధికారులు నిరీక్షించారు. అనంతరం కలెక్టర్ యాస్మిన్‌బాషా మాట్లాడుతూ, తాళంచెవి ఉన్నా.. తాళం రావడంలేదని, ఈవిషయాన్నే హైకోర్టు దృష్టికి తీసుకెళ్తామన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి లక్ష్మణ్‌కుమార్, మంత్రి కొప్పుల ఈశ్వర్ తరపున డీసీఎంఎస్ చైర్మన్ శ్రీకాంత్, అడ్వకేట్ వెంకటేశ్వర్లు హాజరయ్యారు. వీరి సమక్షంలోనే తాళాలు తెరిచే ప్రక్రియ చేపట్టారు.